10

# “నిజమైన యూదుడా దయచేసి లేచి నిలబడతావా?”

## (2:17-29)

పౌలు యూదులపై మోపే నేరాన్ని మనం కొనసాగిస్తున్నాం. మన ప్రస్తుతపు లేఖన భాగం రోమా 2:17-29. “నిశ్చయంగా, నీవు నన్ను అనలేదు కదూ!” అనే పాఠంలో 17నుండి 24 వచనాలు చదివాం కాని వాటి తరువాత వచనాలకు మనం వెళ్లక ముందు ఆ వచనాలను మనం రివ్యూ చేయాలి.

ఏది యూదుని యూదునిగా చేసిందో మన మూల వాక్యమంతటిలో పౌలు నొక్కి చెప్పాడు. ఈ మాటలతో యీ లేఖన భాగము ముగిస్తుంది:

> బాహ్యమునకు యూదుడైనవాడు యూదుడు కాడు; శరీరమందు బాహ్యమైన సున్నతి సున్నతి కాదు. అయితే అంతరంగమందు యూదుడైనవాడే యూదుడు. మరియు సున్నతి హృదయ సంబంధమైనదై ఆత్మయందు జరుగునదే గాని అక్షరమువలన కలుగునది కాదు. అట్టివానికి మెప్పు మనుష్యులవలన కలుగదు దేవునివలననే కలుగును (28, 29 వచనాలు).

ఈ వచనాలకు ఆయా తర్జుమాలను నేను చదివినప్పుడు, “నిజమైన యూదుడు” అని ఎందరు ఉపయోగించారో ఆశ్చర్యపోయాను (RSV; CEV; AB;[1] TEV; Barclay; LB చూడు) లేక “నిజ యూదుడు” (NEB; NCV; Phillips చూడు). ఉదాహరణకు, CJB 28, 29 వచనాలను యిలా తర్జుమా చేస్తుంది:

> ఎందుకంటే *నిజమైన యూదుడు* కేవలం వెలుపలకే యూదుడైయుండడు; నిజమైన సున్నతి భౌతికమైనది బాహ్యమైనది మాత్రమే అయ్యుండదు. దీనికి భిన్నంగా, అంతరంగమందైయున్నవాడే *నిజమైన యూదుడు;* నిజమైన సున్నతి హృదయ సంబంధమైనది, ఆత్మ సంబంధమైనదే గాని అక్షరార్థమయ్యింది కాదు; గనుక అతనికి మెప్పు యితర ప్రజలవలన గాక దేవునినుండియే వస్తుంది. (నొక్కి చెప్పింది నాది.)

“నిజమైన యూదుడు” అనే పదాన్ని నేను ఆలోచిస్తుండగా, “నిజం చెప్పాలంటే” అనే 50ల్లో, 60ల్లో పిలువబడిన యుఎస్ టెలివిజన్ ప్రోగ్రాముకు నా మనస్సు వెళ్లింది. పోటీపడే ముగ్గురు న్యాయ నిర్ణేతల ఎదుట నిలుస్తారు. మొదటివాడు “నా పేరేమంటే, [అతన్ని మనం జో స్మిత్ అని పిలుస్తాం] మరియు నేను [అసాధారణమైన దాన్ని చేశాను].” రెండవ, మూడవ అభ్యర్థులు కూడ జో స్మిత్ అనే చెప్పుకున్నారు. వారు కూర్చున్న

పిమ్మట న్యాయ నిర్ణేతలు ఎవరు సత్యం చెప్పుతున్నారో, ఎవరు చెప్పడం లేదో నిర్ణయించడానికి వారిని ప్రశ్నలు అడిగారు. చివరిలో, "నిజమైన జో స్మిత్ ఎవరో లేచి నిలుస్తాడా?" అని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన వ్యక్తి అడుగుతాడు. అప్పుడు జో స్మిత్ లేచి నిలబడతాడు.

గతంలోనుండి ముగ్గురు వ్యక్తులను ఊహించు. పౌలు దినాల్లో యూదుని యొక్క ప్రత్యేకమైన వస్త్రధారణ అందరు ధరించారు, యూదుని యొక్క భౌతికమైన లక్షణాలను కలిగియున్నారు. "నాకు మోషే ధర్మశాస్త్రముంది. నేను నిజమైన యూదుడనని" మొదటి వాడు అన్నాడు. "నేను నిజమైన యూదుడను. నాకు మోషే ధర్మశాస్త్రముంది, నేను సున్నతి చేయబడ్డాను" అని రెండవవాడు అన్నాడు. "నేను నిజమైన యూదుడను. నాకు మోషే ధర్మశాస్త్రముంది, నాకు సున్నతి ఉంది, మరియు నేను హృదయాన్ని దేవునికి అప్పగించుకున్నాను" అని మూడవవాడు అన్నాడు. *"నిజమైన యూదుడా దయచేసి లేచి నిలబడతావా?"*

## ధర్మశాస్త్రం కలిగియున్నంత మాత్రాన ఒకడు "నిజమైన యూదుడై" ఉండడు (2:17-24)

**భౌతికమైన ఇశ్రాయేలు**

వారి యూదత్వమును నిర్వచించినవాటన్నిటిలో, యూదులలో అనేకులు వారి జాబితాకు పై భాగాన రెండు విషయాలు ఉంచుతారు. మొదటిది దేవుడు వారికి మోషే ధర్మశాస్త్రాన్ని యిచ్చాడనేది (3:1, 2 చూడు), ధర్మశాస్త్రాన్ని గూర్చి యూదులు ఎలా భావించారో రోమా 2:17–24 తెలుపుతుంది. వారు "ధర్మశాస్త్రం మీద" ఆధారపడ్డారు (17 వచనం). వారు "ధర్మశాస్త్రమందు ఉపదేశం పొందారు" (18 వచనం). ధర్మశాస్త్రము "జ్ఞాన సత్య స్వరూపమైనదని" వారు నమ్మారు (19 వచనం). అందువలన వారు "ధర్మశాస్త్రమందు" అతిశయించారు (23 వచనం). "దేవుని ధర్మశాస్త్రము కలిగి యుండుటను గూర్చి అతిశయించారని" NCV అంది.

దేవుడు డెబ్బది దేశాలకు వెళ్లి ఆయన తన ధర్మశాస్త్రాన్ని వారికి యిస్తానని అంటే వారందరు దాన్ని నిరాకరించారనే కట్టుకథ ఒకటి యూదులకు ఉంది. చివరిగా, ఇశ్రాయేలీయులు అని పిలువబడే చిన్న గుంపునొద్దకు ఆయన వచ్చాడు. ఆయన ధర్మశాస్త్రాన్ని వారికి యివ్వ జూచినప్పుడు, "మేము దాన్ని తీసుకొంటాం" అని వారు అన్నారట! ఆ కథ కేవలం కల్పితమైనది, కాని ధర్మశాస్త్రం కలిగియుండడంలో యూదులు ఎలా ఫీలయ్యారో అది ఉదహరిస్తుంది. ధర్మశాస్త్రాన్ని జాగ్రత్తగా చూచుకొనేవారుగా వారు ప్రత్యేకమైనట్టు భావించారు! (ఆ కట్టు కథ ప్రకారం, దాని విలువను గుర్తించ గలిగినంత తెలివిగలవారు వారేయనుకుంటారు!)

విషాదకరంగా, ధర్మశాస్త్రం *కలిగియుంటేనే* సరిపోతుందని వారు తలంచారు. అది వారికుంది కాని, వారు దాన్ని పాటించలేదు (లోబడలేదు). "ధర్మశాస్త్రాన్ని కేవలం

వినేవారు కాదు గాని ధర్మశాస్త్రమును అనుసరించి ప్రవర్తించువారే దేవుని దృష్టికి నీతిమంతులుగా ఎంచబడుదురని" 13వ వచనంలో పౌలు చెప్పాడు. ఇప్పుడు, 23వ వచనంలో, "ధర్మశాస్త్రమందు అతిశయించు నీవు ధర్మశాస్త్రము మీరుటవలన దేవుని అవమానపరచెదవా?" అని అతడన్నాడు. జవాబును గర్భితమందు కలిగియున్న భాషా చాతుర్యపు ప్రశ్న అది: "అవును, ధర్మశాస్త్రాన్ని మీరినప్పుడు నీవు దేవుని అవమానపరచు తున్నావు."

ఊహించిన మన ఆట ప్రదర్శనలో, "నిజమైన యూదుడా దయచేసి లేచి నిలబడతావా?" అని మనం అన్నప్పుడు, మొదట పోటీపడిన అభ్యర్థి కూర్చునే ఉండి పోయాడు. కేవలం ధర్మశాస్త్రం *కలిగియుండడమే* అతని "నిజమైన యూదునిగా" చేయదు.

**ఆత్మ సంబంధమైన ఇశ్రాయేలు**

భౌతికమైన యూదులవైపు పౌలు (రిమార్క్స్) మాటలు సూచించబడ్డాయి, కాని మనకు వాటిని వర్తింపజేసికొనడం తగియుంటుంది. యూదులైనా, అన్యజనులైనా - అబ్రాహాము విశ్వాసంవంటి విశ్వాసంగలవారు అబ్రాహాముకు - ఆత్మ సంబంధమైన సంతతియై ఉంటారని 4వ అధ్యాయంలో పౌలు చెప్పాడు (12, 16 వచనాలు; గలతీయులకు 3:29 చూడు). గలతీయులకు తన పత్రికలో, క్రైస్తవులను "దేవుని ఇశ్రాయేలుగా" పౌలు సూచించాడు (6:15, 16).

ఆత్మ సంబంధమైన ఇశ్రాయేలుగా, మనం యికను ఏ మాత్రమును ధర్మశాస్త్రానికి బద్ధులము కాము (రోమా 7:4 చూడు). కాని "క్రీస్తు నియమం" మనకుంది (1 కొరింథీయులకు 9:21), అది "స్వాతంత్ర్యమునిచ్చు సంపూర్ణ నియమం" (యాకోబు 1:25). (మనకు చట్టమే లేకుంటే, పాపులుగా మనం ఒప్పింపబడలేం [రోమా 4:15బి; 5:13బి చూడు].) ప్రత్యేకించి, క్రీస్తునందు చేయబడిన క్రొత్త నిబంధనను దేవుడు మనకు యిచ్చాడు (హెబ్రీయులకు 9:15-17 చూడు) - ఉపదేశించడానికి, ఖండించడానికి, తప్పు దిద్దడానికి, నీతియందు శిక్షచేయడానికి యిది మనకు యివ్వబడింది (2 తిమోతి 3:16, 17 చూడు). ఇది ఎంతటి దీవెనకరమయ్యిందో! John Fawcett యిలా రాశాడు,

> ప్రేరేపణవలన ప్రసాదింపబడిన,
> దైవ గ్రంథము ఎంత ప్రశస్తమైనది!
> నా ఆత్మను పరలోకానికి నడిపించడానికి,
> దాని కట్టడలు దీపమువలె కాంతిగా ప్రకాశించును.
> దైవికమైన పరిశుద్ధ గ్రంథం!
> నా ప్రశస్తమైన ధన నిధి!
> క్షేమంగా యింటికి నడిపించడానికి
> నా పాదములకు దీపము నా త్రోవకు వెలుగైయున్నది.[2]

కేవలం బైబిలు[3] కలిగియుండి, దాని కట్టడలను అలక్ష్యం చేయడంవలన ప్రయోజన ముండదు. దానికంటె హీనమైనది, అది అసంగతమైనది. అరణ్యంలో తప్పిపోయినవాని చేతిలో దిక్సూచి ఉండియు దానినెన్నడు చూడనివానివలె ఉంది. ... లేక, తన జేబులో

దేశ పటాన్ని పెట్టుకొని, పరిచయంలేని భూ భాగంలో పయనించుతూ, దాన్ని ఎన్నడూ చూడనివానివలె ఉంది. ... లేక, తాను వెళ్లవలసిన దిక్కును సూచించే స్తంభం ఎదుట నిలిచి అచ్చోటనుండి కదలక నిలిచియుండే ప్రయాణికునివలె ఉంటుంది. కేవలం మోషే ధర్మశాస్త్రం కలిగియుండడం ఒకని నిజమైన యూదునిగా చేయనట్టే – కేవలం క్రొత్త నిబంధన ప్రతి కలిగియున్నంత మాత్రాన ఒకడు నిజ క్రైస్తవుడు కానేరడు.

## కేవలం సున్నతి పొందడం ఒకని "నిజమైన యూదుని" చేయదు (2:25-27)

### భౌతికమైన ఇశ్రాయేలు

యూదునికి, తన యూదత్వాన్ని నిర్వచించడంలో సున్నతి రెండవ అతి ప్రాముఖ్యమైన సంగతియై ఉంటుంది. సున్నతి ఇశ్రాయేలు జాతీయ గురుతును వ్యక్తపరచునదియు, యూదులైన పురుషులందరికి అవసరమైనదియునైయుంది. అధ్యాయం 2లోని మిగిలిన భాగంలో పౌలు సున్నతి అనే అంశం వైపుకు తిరిగాడు.

"సున్నతి" అనేది (*peritome*) అనే మిశ్రమమైన పదంనుండి తర్జుమా చేయబడింది. "కత్తిరించుటకు" (*temno*[4]) అనేది "చుట్టు" (*peri*) అనే దానితో చేర్చబడింది. దానికి "చుట్టును కత్తిరించు"[5] అని అర్థం. ఆంగ్లంలోని "circumcision" అనే పదం లాటిన్‌నుండి వచ్చింది – అదే అర్థం (*circum* ["చుట్టును"] దానితో ["కత్తిరించుట"] *cise*). అటు గ్రీకులోను, యిటు ఆంగ్లంలోను గోప్యాంగ చర్మాన్ని తొలిగించే శస్త్ర చికిత్సకు సంబంధించిన విధానాన్ని సూచిస్తుంది (ఆదికాండము 17:11; నిర్గమకాండము 4:25 చూడు).

అబ్రాహాముతో దేవుడు చేసిన నిబంధనను గూర్చి యూదులైన తలిదండ్రులు తమ పిల్లలకు తెలుపుటలో ఎన్నడూ అలసిపోలేదు:

> అబ్రాహాముతో దేవుడు, "నీవును, నీవు మాత్రమే గాక నీ తరువాత వారి తరములలో నీ సంతతియు నా నిబంధనను గైకొనవలెను. నాకును నీకును నీ తరువాత నీ సంతతికిని మధ్య మీరు గైకొనవలసిన నా నిబంధన యేదనగా – మీలో ప్రతి మగవాడును సున్నతి పొందవలెను. మీరు మీ గోప్యాంగచర్మమున సున్నతి పొందవలెను. అది నాకు నీకు మధ్యనున్న నిబంధనకు సూచనగా ఉండును. ఎనిమిది దినముల వయస్సుగలవాడు, అనగా నీ యింట పుట్టినవాడైనను, నీ సంతానము కాని అన్యునియొద్ద వెండితో కొనబడినవాడైనను, మీ తరములలో ప్రతి మగవాడు మీలో సున్నతి పొందవలెను" (ఆదికాండము 17:9–12).

దేవునికిని, అబ్రాహామునకును మధ్య జరిగిన "నిబంధనకు సున్నతి *గురుతైయున్న*" సంగతిని గుర్తించాలి. రోమా 4:11లో అబ్రాహామునకు సంబంధించి అలాటి భాషనే పౌలు ఉపయోగించాడు: "తనకు కలిగిన విశ్వాసమువలననైన నీతికి *ముద్రగా*, సున్నతి అను *గురుతు* పొందెను" (నొక్కి చెప్పింది నాది).

అబ్రాహాము కాలమునుండి ఇశ్రాయేలు పొందిన సున్నతి వరుస క్రమంగా పాటింపబడుతుంది. Douglas Moo ప్రకారం, “మెక్కబీయులు తిరుగుబాటు చేసిన కష్టకాలంలో (క్రీ.పూ. 166–160) యూదా ప్రజల మధ్య నూతన స్థాయి ప్రాముఖ్యతకు అది లేపబడింది.”[6] నేడు వైద్య కారణాలవలన కొందరు పసి బాలురకు సున్నతి జరుగుతుంది; కాని యూదులకైతే, అది కాలం ఘనపరచిన ఎంతో భక్తి మర్యాదలతో జరిగే వైదిక కర్మగా రూపొందింది.[7] సున్నతి “[యూదుడైన మగవానిని] యూదునిగా గుర్తు వేసే శస్త్ర సంబంధమైన వైదిక కర్మయైయుండి,” “దేవునికి బహు సన్నిహితంగా చెందినట్టి గురుతైయుంది” (2:25; MSG; Phillips). తాము “సున్నతిగలవారని” యూదులు సగౌరవంగా చెప్పుకొంటూ, అన్యజనులను “సున్నతిలేనివారని” సూచించేవారు (3:30 చూడు).

యూదుని మనస్సులో సున్నతికిగల ప్రాముఖ్యత దైవ ప్రేరేపితం కాని రబ్బీల సామెతలలో చూడవచ్చు. “రాబోవు లోకంలో సున్నతిపొందినవారికందరికి భాగముంది”[8]; “సున్నతి ఇశ్రాయేలీయుని గెహెన్ననుండి తప్పిస్తుంది”[9]; “సున్నతిపొందిన ఏ యూదుడును నరకాన్ని చూడడు.”[10] ఈలాటి సూక్తులు దేవునికి లోబడడం లేక లోబడకుండడం అనేదానికి సంబంధించిన అక్కరను వ్యక్తపరచవు; దేవునితో నిత్య జీవాన్ని నిశ్చయం చేయడానికి సున్నతి చాలునదిగా భావించబడింది.

రోమా 2:25–29లో, కొందరు రబ్బీలు బోధించినదానికి భిన్నంగా, కేవలం సున్నతి మాత్రమే ఒక యూదుని నిజమైన యూదునిగా చేయలేదని పౌలు చూపించాడు. “సున్నతి ప్రయోజనకరమగును గాని ...” అంటూ అతడు ఆరంభించాడు (25ఎ వచనం). దేవుడు యూదులను నిశ్చితమైన ఆధిక్యతలతో దీవించాడు (3:1, 2 చూడు). యూదుడై ఉండడానికి సున్నతి తప్పనిసరియై ఉన్నందున, దానికి విలువ ఉండేది.

అప్పుడు పౌలు “అయితే” అనే చిన్న పదాన్ని చేర్చాడు: “నీవు ధర్మశాస్త్రమును అనుసరించి[11] ప్రవర్తించువాడవైతే” (2:25ఎ; నొక్కి చెప్పింది నాది). సున్నతి దానంతట అదే సిద్ధి కలిగించునది ఎన్నడూ కాదు. దేవునితో ఒకడు నిబంధన సంబంధంలో ఉన్నాడని సూచించడానికి అది గురుతు మాత్రమే – గాని సున్నతి పొందినవాడు ఆ నిబంధనను నెరవేర్చ బద్ధుడైయున్నాడు (గలతీయులకు 5:3 చూడు). విషాదకరంగా, విధేయతకు మారుగా యూదులు సున్నతిని ఉపయోగించుకున్నారు.

సున్నతి పొందినవాడు “ధర్మశాస్త్రాన్ని అనుసరించకపోతే” ఏమి జరుగుతుంది? “ధర్మశాస్త్రమును అతిక్రమించువాడవైతివా, నీ సున్నతి సున్నతి కాకపోవును” అని పౌలు అన్నాడు (రోమా 2:25సి). యూదునికి ఆ మాటలు ఎంతగా దిగ్భ్రమ కలిగించాయో: “సున్నతి పొందనివారిలో” ఒకడైయుండడం ఆలోచింపలేనిదైయుంటుంది! శస్త్ర విధానాన్ని తిప్పివేయడాన్ని పౌలు సూచించడం లేదు. అయితే, తమకు దేవునితో గల నిబంధనను యూదులు నెరవేర్చనట్టయితే, ఆ నిబంధన గురుతును వారు ఎన్నడూ పొందనట్టు ప్రవర్తించుతున్నారు (NIV చూడు).

తన పెండ్లి కుమార్తెతో వివాహపు బాసలు (ప్రమాణాలను) చేసి, తాను వివాహితుడు కానట్టే మసలుకొనడం అసహ్యించుకోదగినదైయుంటుంది. నెరవేర్చాలనే ఉద్దేశం లేకుండ

ఒకడు కాంట్రాక్టుపై సంతకం పెట్టడం బహు హీన స్థితియైయుంటుంది. దేవునితో నిబంధన చేసికొని, దాన్ని అలక్ష్యం చేయడం ఎంతటి అమర్యాదయై ఉంటుంది!

"సున్నతి పొందినవారే" "సున్నతి లేనివారుగా" మారిపోయినప్పుడు, "సున్నతి లేనివారు" "సున్నతి గలవారుగా" చూడబడే అవకాశముంది. పౌలు యిలా కొనసాగించాడు, "కాబట్టి సున్నతి లేనివాడు ధర్మశాస్త్రపు నీతివిధులను గైకొనినయెడల అతడు సున్నతి లేనివాడైయుండియు సున్నతిగలవాడుగా ఎంచబడును గదా?" (26 వచనం). రెండు గ్రీకు పదాల తర్జుమాతో "సున్నతి లేనివారు" అనేది వచ్చింది (KJV చూడు). "సున్నతి" అనే గ్రీకు పదానికి (*a*) ముందు చేర్చితే, యిది వస్తుంది. దీనికి బదులు, వేరే పదం ఉపయోగించబడింది (*akrobustia*) అంటే, "ముందోలుగల" అని అర్థం.[12]

ఈ సున్నతి లేని వ్యక్తి "ధర్మశాస్త్రపు విధులను" ఆచరించుతున్నట్టు పౌలు పలికాడు (26ఎ వచనం), "అనుసరించు" (*phulasso*) అంటే, "కాపాడు," "భద్రము చేయునట్టు ఉంచు" అని అర్థం యిస్తుంది.[13] అతిక్రమించకుండునట్టు ధర్మశాస్త్రాన్ని "కాపాడు" అనే అర్థం వస్తుంది. అంటే, దాని సూత్రాలను అనుసరించు – అని.[14] "కావలసిన" అనేది "నీతి" అనే పద బంధానికి చెందిన *dikaiomata* నుండి తర్జుమా చేయబడింది (*dikai* అనేదాన్ని ఆరంభంలో చూస్తావు). KJV ఈ పదాన్ని "నీతి" అని; NKJV "నీతి విధులు" అని తర్జుమా చేస్తుంది.

కొన్ని వచనాలకు ముందు, కొందరు అన్యజనులు "స్వాభావికముగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలు" చేసినట్టి పౌలు ప్రతిపాదనను మనం చూచాం (14 వచనం). దేవుని యొద్దనుండి వ్రాయబడిన ధర్మశాస్త్రాన్ని వారు పొందలేదు, కాని మంచి చెడ్డలనే జ్ఞానం కలిగి, మోషే ధర్మశాస్త్రంలో కన్పించే నీతి సూత్రాలను పోలినవాటిని అనుసరించారు.

భౌతిక సున్నతి దానంతట అదే చాలినది కాదని ఆలాటి వ్యక్తులు నిరూపించినట్టు యిప్పుడు పౌలు సూచించాడు: "... సున్నతి లేనివాడు [స్వాభావికముగా] ధర్మశాస్త్రపు నీతి విధులను గైకొనినయెడల [వ్రాయబడిన ధర్మశాస్త్రం అతనికి లేకున్నను] అతడు సున్నతి లేనివాడై యుండియు సున్నతిగలవాడుగా ఎంచబడును గదా?" (26 వచనం). "ఎంచబడును" అనేది *logizomai*నుండి తర్జుమా చేయబడింది; "ఎంచు," "లెక్కించు"[15] అని దాని అర్థం. (4వ అధ్యాయంలో యిది కీలక పదమైయున్నట్టు మనం చూడబోతాం.) "ధర్మశాస్త్రం చెప్పింది వారు చేసినట్టయితే, వారు సున్నతి గలవారైయున్నట్టే" అని NCV అంది.

పౌలు రెండంతల స్థిరంగా చెప్పేది రెండు సరళమైన ఈక్వేషన్‌లలో వ్యక్తపరచ వచ్చునని John R. W. Stott అన్నాడు:[16]

> సున్నతి – విధేయత = సున్నతి లేకపోవడం
> సున్నతి లేకపోవడం + విధేయత = సున్నతి

యూదునికి యివి ఎంతటి దిగ్భ్రమ కలిగించే భావాలైయుంటాయోనని నేను మరల అంటున్నా! ఏదియెలాగున్నా, కలతచెందించే ప్రతిపాదనలు చేయడం పౌలు యింకా ముగించలేదు.

27వ వచనం యిలా ఆరంభమౌతుంది, “మరియు స్వభావమునుబట్టి[17] సున్నతి లేనివాడు ధర్మశాస్త్రమును నెరవేర్చినయెడల” (27ఎ వచనం). ఇక్కడ, “నెరవేర్చిన” అని తర్జుమా చేయబడినది వేరైన పదం (*telousa*). *Telousa- telos*కు (“అంతము” )నకు సంబంధమైన పదం – “ఉద్దేశింపబడిన అంతానికి తెచ్చుట” అని అర్థం.[18] KJVలో “నెరవేర్చిన” అని ఉంది. అన్యజనులు నిజంగానే మోషే ధర్మశాస్త్రానికి లోబడలేదు (అది వారు కలిగియుండనిది); కాని ఆలాటి నీతి సూత్రాల ప్రకారం జీవించడంవలన, ధర్మశాస్త్రం యొక్క ఉద్దేశాలలో ఒకదానిని నెరవేర్చినవారయ్యారు.

ధర్మశాస్త్రాన్ని అనుసరించిన అన్యజనులకు సంబంధించి, “అక్షరమును సున్నతియు గలవాడవై ధర్మశాస్త్రమును[19] అతిక్రమించు నీకు తీర్పు తీర్చుడా?” అని పౌలు అన్నాడు (27బి వచనం). ఇక్కడ మరొక ఆశ్చర్యముంది! అన్యజనులకు తగిన తీర్పరులమని యూదులు తమ్మును గూర్చి తామే తలంచేవారు (2:1, 3 చూడు), కాని సరియైనదాన్ని జరిగించిన అన్యజనులు తప్పు చేసే యూదులకు తీర్పు తీర్చుతారు (*krino*)! “తీర్పు తీర్చడమనేది పోల్చి చూడడమనే పరోక్షపు తీర్పు అయ్యింది”[20] (యేసును నిరాకరించిన వారిని నీనెవెవారు “తీర్పు తీర్చినట్టు” [మత్తయి 12:41]).

అన్యజనులు వ్రాయబడిన శాసనం లేనివారైయుండి, వాటి విధులలో కొన్నింటిని అనుసరించినట్టయితే, అప్పుడు వ్రాయబడిన ధర్మశాస్త్రంగలవారు యూదులు నిశ్చయంగా ఆలాగే చేయగలిగియుండేవారే! అప్పగింపబడిన పనిని గూర్చి “అది బహు కష్టమైనది” అని నవ యువకుడు ఫిర్యాదు చేయడం నాకు గుర్తుకొస్తుంది. అందుకు అతని తండ్రి యిలా బదులిచ్చాడు, “అదిగో అక్కడున్న బాలుని చూడు. అతడు నీలో సగమున్నాడు, అయినా అతడు దాన్ని చేస్తున్నాడు!” ఎంత సంకటమైనదైయుందో!

25నుండి 29వరకు గల వచనాల మీద ఆధారం చేసికొని, చేయబడిన కొంత తప్పుడు రీజనింగ్ నేను యిక్కడ ఆగి దిద్దవలసియుంది. ఈ వచనాలలో పౌలు ఉద్దేశం – సున్నతివలన లాభం లేదని, ఒకడు సున్నతిపొందినా, పొందకపోయినా వ్యత్యాస మేమియు లేదని పౌలు ఉద్దేశమైయున్నట్టు కొందరు నిగ్గదీశారు. సున్నతి నేడు ఆత్మ సంబంధమైన ఏ ప్రాముఖ్యతను కలిగియుండలేదనేది నిజం (1 కొరింథీయులకు 7:19; గలతీయులకు 5:6; 6:15), పౌలు రిమార్క్సుకు పూర్వ చరిత్ర – క్రీస్తు రాక ముందు యూదులకు, అన్యజనులకు దేవుని ఏర్పాట్లు వ్యత్యాసంగా ఉన్నాయని మనస్సులో ఉంచుకోవాలి. ఆ ఏర్పాట్లు క్రింద, అన్యజనులు సున్నతి చేసికొనడం ప్రాముఖ్యం కాదు, కాని యూదుడు సున్నతి చేయించుకొనడం ప్రాముఖ్యం. యూదులలోని మగవాడు సున్నతిపొందకపోయినట్టయితే, అతడు పస్కాను ఆచరించలేడు (నిర్గమకాండము 12:48 చూడు) లేక దేవాలయంలోనికి ప్రవేశింపలేడు (యెహెజ్కేలు 44:9 చూడు); అతడు “తన ప్రజలలోనుండి కొట్టివేయబడవలయును” (ఆదికాండము 17:14). Moses E. Lard యిలా రాశాడు,

> … యిక్కడ మనం వ్యత్యాసాన్ని గమనించక విడవకూడదు. అన్యజనుడు సున్నతి చేసికోనట్టుగా ఉండడం యూదుడు సున్నతి చేసికొనకపోవడం ఒక్కటే కాదు. ఆ విషయంలో యూదుడు దేవుని నిబంధనను అతిక్రమించాడు, కాని అన్యజనుని పట్ల

అది నిజం కాదు. అయితే యూదుడు సున్నతి పొందినవాడైన తరువాత, అతడు ధర్మశాస్త్రాన్ని ఆచరించకపోయినట్లయిన, అతని సున్నతి దేనికిని లెక్కించబడదు.[21]

పౌలు ఉపదేశం ఈ విధంగా వ్యక్తపరచవచ్చు: నిబంధన "గురుతు" కలిగి దాన్ని ఆచరించని వానికంటెను నిబంధన సంబంధమైన "గురుతు" లేకయే నిబంధనను ఆచరించువాడు శ్రేష్ఠమైన, ఆత్మ సంబంధమైన స్థితిలో ఉన్నాడు. ఈ సత్యానికి బైబిలు ఉదాహరణ సహాయపడుతుందా? కొర్నేలియనే అన్యుడైన శతాధిపతిని గూర్చి ఆలోచించు (అపొస్తలుల కార్యములు 10:1, 2). అతనికి సున్నతి "గురుతు" లేదు. సున్నతియనే "గురుతు" కలిగిన యూదుల ప్రధాన యాజకుడైన కయప శీలానికి, అతని శీలానికి గల తారతమ్యాన్ని చూడు (మత్తయి 26:3, 4, 57, 62-68).

మరొకసారి, మనము తిరిగి ఊహా సంబంధమైన ఆట ప్రదర్శనానికి వద్దాం. "నిజమైన యూదుడా దయచేసి నీవు లేచి నిలబడతావా?" అని ఏర్పాటు చేసినవాడు అంటాడు. పోటీపడిన రెండవవాడు ("నాకు ధర్మశాస్త్రముంది, మరియు నేను సున్నతి చేయబడ్డాను" అని చెప్పేవాడు) కూడ కూర్చుండియే ఉన్నాడు. కేవలం ధర్మశాస్త్రం కలిగియుండడం, సున్నతి పొందియుండడం నిజమైన యూదుని చేయనేరవు.

**ఆత్మ సంబంధమైన ఇశ్రాయేలు**

మరల, ఆత్మ సంబంధమైన ఇశ్రాయేలుగా, యూదులతో పౌలు పలికిన మాటలనుండి మనం నేర్చుకోగలం. ఫలాని వైదిక కర్మలు జరిగించితే, దేవునితో సరియైన సంబంధం ఉంటుందని యూదుడు తలంచాడు. ధర్మశాస్త్రం కలిగియుండడంలో ఉపయోగముందా? అవును. ఉపయోగమే ఉంది (రోమా 3:1, 3 చూడు). యూదుల పురుషుడు సున్నతి చేయబడవలెనా? నిశ్చయముగా. ఈ రెండింటిలో ఏది లేకపోయినా అతడు యూదుడై ఉండడు. ఏదియెలాగున్నా, దేవునికి లోబడడానికి బదులుగా ధర్మశాస్త్రం కలిగియుండడం సున్నతి చేయబడడం సరిపోతుందా? ఎన్నటికీ కాదు!

క్రొత్త నిబంధన క్రైస్తవ్యాన్ని పునరుద్ధరించ బూనుకొన్న మనము పాపక్షమాపణకొరకు బాధ్యతగల వ్యక్తులకు ముంచడం యిస్తాం. వారంలో ప్రతి మొదటి దినాన ప్రభురాత్రి భోజనంలో పాల్గొంటాం. దేవునికి మనం చేసే ఆరాధనలో, సంగీత వాయిద్యాలు లేకుండ మనం పాడతాం. ఇవన్నియు ప్రాముఖ్యమా? అవును, అవి ప్రాముఖ్యమే. ప్రభువు సంఘమని మనం చెప్పుకొంటూ యింకోరకంగా మనం చేయగలం? ఏదియెలాగున్నా, ప్రభువు ఆజ్ఞాపించిన ఈ క్రింది ఆజ్ఞలకు లోబడడానికి యివి ప్రత్యామ్నాయముగా ఉంటాయా?

ప్రియులారా, మనము ఒకనినొకడు ప్రేమింతము (1 యోహాను 4:7ఎ).

కాబట్టి మనకు సమయము దొరకినకొలది అందరియెడలను, విశేషముగా విశ్వాస గృహమునకు చేరినవారియెడలను మేలు చేయుదము (గలతీయులకు 6:10ఎ).

ఒకనియెడల ఒకడు దయగలిగి కరుణాహృదయులై ... ఒకరినొకరు క్షమించుడి (ఎఫెసీయులకు 4:32ఎ).

శక్యమైతే మీ చేతనైనంతమట్టుకు సమస్త మనుష్యులతో సమాధానముగా ఉండుడి (రోమా 12:18).

“కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి” (మత్తయి 28:19ఎ).

“నిజమైన క్రైస్తవుడుగా” ఉండాలంటే, ప్రభువు ఆజ్ఞాపించినవన్నియు గైకొనుటలో మనము తీవ్రముగా ఉండాలి.

## దేవునికి హృదయం అర్పించడంలో “నిజమైన యూదుడౌతాడు” (2:28, 29)

“యూదుడు” అనేదానికి నిర్వచనంగా అనేకమంది యూదులు దేన్ని తలంచుతారో, దానికి పౌలు యొక్క మూలమైన ప్రతిపాదనలు నడిపిస్తున్నాయి. రోమా 2:28 యిలా ఆరంభమౌతుంది, “బాహ్యమునకు యూదుడైనవాడు యూదుడు కాడు” (28ఎ వచనం). “బాహ్యమునకు” అనేది మూడు పదాలనుండి తర్జుమా చేయబడింది (*en to phaneo*) అంటే, “వెలుపలగా ఉన్నది.” “చూడ వీలగునది.” AB “బాహ్యంగాను, బహిరంగంగాను” ఉన్నది, McCord తర్జుమాలో, “కన్పించేది” అని ఉంది. ప్రతి యూదునికి ప్రియమైన వైదిక కర్మ, ఆచారాలు, యితర బాహ్యమైన సంగతులను అది సూచిస్తుంది. “శరీరమందు బాహ్యమైన సున్నతి సున్నతి కాదు”[22] (28బి వచనం). “బాహ్యమునకు,” “బాహ్యమైన” అనేవి అదే గ్రీకు పదంనుండి వచ్చాయి. “వెలుపట శరీరమందు” అనేదానికి బదులు, “బాహ్యమైనది, శరీర సంబంధమైనది” అని NIV అంది.

బాహ్యంగా వ్యక్తపరచబడేవి ఒక యూదుని యూదునిగా చేయనట్లయితే, అతని యూదునిగా చేసింది ఏమి? “అయితే అంతరంగమందు యూదుడైనవాడే యూదుడు” అని పౌలు అన్నాడు (29ఎ వచనం). “అంతరంగమందు” అనేది కూడ మూడు పదముల తర్జుమాయై ఉంది (*en to krupto*); ఈ మాటలకు అర్థం – “రహస్యమందు” చూడనొల్లనిది.[23] McCord “కనిపించని” అని అన్నాడు.

పౌలు యిలా కొనసాగించాడు, “మరియు సున్నతి హృదయ సంబంధమైనదై ఆత్మయందు జరుగునదే” (29బి వచనం). ఈ ఉద్ఘాటన యూదులు ఎన్నడు విననిదేమీ కాదు. “హృదయమందు సున్నతి చేయబడడం” యొక్క ప్రాముఖ్యతను పాత నిబంధన లేఖకులు నొక్కి చెప్పారు (ద్వితీయోపదేశకాండము 30:6; లేవీయకాండము 26:41; యిర్మీయా 9:25, 26; యెహెజ్కేలు 44:7, 9). “కాబట్టి మీరు సున్నతిలేని మీ హృదయమునకు సున్నతి చేసికొని యికమీదట ముష్కరులు కాకుండుడి” అని మోషే ఇశ్రాయేలీయులకు ఆజ్ఞ యిచ్చాడు (ద్వితీయోపదేశకాండము 10:16). దేవుని యొద్దనుండి యిర్మీయా ఈ సందేశాన్ని అందించాడు: “అవిధేయులైయుండుట మానుకొని మీ దుష్ట క్రియలను బట్టి యెవడును ఆర్పివేయలేనంతగా నా ఉగ్రత అగ్నివలె కాల్చకుండునట్లు యూదావారలారా, యెరూషలేము నివాసులారా, యెహోవాకు లోబడి యుండుడి” (యిర్మీయా 4:4).

గోప్యాంగ చర్మమును తొలిగించుటకు శరీర సంబంధమైన సున్నతి “చుట్టు కత్తిరించుట” అవుతుంది. నరుడు తన ప్రభువును ఘనపరచునట్లు ఆత్మ సంబంధమైన సున్నతి – దుష్టత్వము తిరుగుబాటు తనమును హృదయమునుండి “తొలగించుకునే కత్తిరింపైయుంటుంది.” శరీర సంబంధమైన సున్నతికి భౌతికమైన శస్త్ర ప్రయోగముండగా, హృదయపు సున్నతికి “ఆత్మ సంబంధమైన శస్త్ర చికిత్స” కావలసియుంటుంది.

ఈ హృదయపు సున్నతి “ఆత్మయందు జరుగునదే గాని అక్షరమువలన కలుగునది కాదు” (రోమా 2:29సి). “అక్షరము” అనేది వచనం 27లో “ధర్మశాస్త్రపు అక్షరం” అని తర్జుమా చేయబడిన దానినుండి వచ్చింది. మరల NIVలో “వ్రాయబడిన ధర్మశాస్త్రము” అని అన్నది. ఈ సందర్భంలో అది మోషే ధర్మశాస్త్రాన్ని సూచిస్తుంది.

“అక్షరము” “ఆత్మకు” (*pneuma*[24]) తారతమ్యంగా యివ్వబడింది. ఆత్మను **“ఆ”** అక్షరంతో చూపాలా లేక “ఆ” అక్షరంతో చూపాలా? అనే అనిశ్చయత మామూలుగానే నిలిచియుంది. తర్జుమాదారులు కొందరు అలా అంటారు, మరి కొందరు యిలా అంటారు. ఈ తబ్బిబ్బు KJV మరియు వారి వెంట వచ్చినవారిలో ఉదహరింపబడుతుంది: KJV ఏమో “ఆత్మ” అంటుంటే, NKJV ఏమో **“ఆత్మ”** అని అంటుంది.

చిన్న అక్షరం “ఆ”తో ఆ మాట ప్రారంభించవలసియుంటే, RSVకి సరియైన ఐడియా ఉండియుండవచ్చు: “నిజమైన సున్నతి హృదయ సంబంధమైనదై, ఆత్మ *సంబంధమైనదే* గాని అక్షరార్థమయ్యింది కాదు. [అంటే, అక్షరార్థంగా మాంసాన్ని తుంచివేయడం కాదు]” (నొక్కి చెప్పింది నాది).

పెద్ద అక్షరం **“ఆ”**తో పదం ప్రారంభం కావలసివస్తే, హృదయపు సున్నతి దైవికమైన కార్యమేగాని మానవ కార్యం కాదని పౌలు నొక్కి చెప్పియుండవచ్చు. (“ఆత్మవలన” అంటే, “దేవుని ఆత్మచేత” అని యూదునికి అర్థమౌతుంది. క్రొత్త నిబంధన సిద్ధాంతంగా, పరిశుద్ధాత్మగా తెలియబడే వేరైన, దైవికమైన వ్యక్తి అనే ఐడియా, పాత నిబంధనది కాదు.[25]) Eugene Peterson దీన్ని ఈ విధంగా వ్యక్తపరచాడు: “యూదునిగా చేసేది, నీ హృదయం మీద దేవుని గురుతే, చర్మం మీద చాకు యొక్క గురుతు కాదు” (MSG).

“ఆత్మ” అనేది పెద్ద **“ఆ”**తో లేక చిన్న “ఆ”తో ఆరంభమైనా – రెండింటిలో ఏదైనా మంచి భావమే యిస్తుందని Leon Morris అన్నాడు. “రెండింటిలో ఏదైనా పౌలు ఒక విషయాన్ని చెప్పుతున్నాడు, ఏమంటే ధర్మశాస్త్రం కోరే బాహ్యామైనవాటిని పట్టించుకొని అనుసరించడం పూర్తిగా పాయింటును పోగొట్టుతుంది.”[26] యూదుడు శరీరమందు సున్నతి పొందియు అతని హృదయము తాకబడకయున్నట్టయితే, అతని సున్నతి విలువ లేనిదైయుంటుంది.

“అట్టివానికి మెప్పు మనుష్యులవలన కలుగదు దేవునివలననే కలుగును” అంటూ పౌలు ముగిస్తున్నాడు (29డి వచనం). తాము చూచేదాన్ని శ్లాఘిస్తారు, కాని దేవుడు కన్పించని హృదయ సున్నతిని శ్లాఘిస్తాడు (1 సమూయేలు 16:7 చూడు). “ప్రభువును ప్రేమించేవారు మనుష్యుల మెప్పుకొరకు కాదు దేవుని మెప్పుకొరకు” తమ జీవితాలను జీవిస్తారు (రోమా 2:29; Phillips).

వచనం 29 అంతంలో మాటల ఆటను పౌలు ప్రయోగించినట్టు కొందరు

తలంచుతారు. "యూదుడు" అనే పేరు "యూదానుండి" తీయబడింది. "శ్లాఘించు" (స్తుతి) అనే ఐడియాను అది కలిగిస్తుంది (ఆదికాండము 29:35; 49:8 చూడు). అందును బట్టి "యూదుడు" "శ్లాఘింపబడువాడు" అనే ఆలోచన కలుగవచ్చు. ఏదియెలాగున్నా, "శ్లాఘింపబడువాని" హృదయము సున్నతి చేయబడకుంటే, అతడు కేవలం మనుష్యుల మెప్పును పొందగలడే గాని దేవుని మెప్పును పొందలేడు.

మనం తిరిగి మన ఊహా ఆట ప్రదర్శనకు వద్దాం: "నిజమైన యూదుడా దయచేసి లేచి నిలబడతావా?" "నాకు మోషే ధర్మశాస్త్రం ఉంది, నేను సున్నతి చేయబడ్డా, హృదయమందు నేను దేవునికి అప్పగించుకొన్నవాడను" అని ఎవడు చెప్పుతాడో, అతడు చిరునవ్వుతో తన చోటునుండి లేచి నిలబడతాడు. పౌలు ప్రకారం ఈలాటి యూదుడే నిజమైన యూదుడు.

**ఆత్మ సంబంధమైన ఇశ్రాయేలు**

రోమా 2:28, 29లోని మాటలను వ్రాసినప్పుడు, పౌలు మనస్సులో ప్రాథమికంగా, భౌతికమైన యూదులే ఉన్నారు. "నీవు యూదుడవని నిన్ను నీవు పిలుచుకోవచ్చును గాని లోపలను వెలుపలను నీవు యూదుడవయ్యేవరకు నీవు *నిజంగా* యూదుడవు కావు" అనేది పౌలు యొక్క సందేశమైయుంది. క్రైస్తవులు అబ్రాహాము యొక్క ఆత్మ సంబంధమైన సంతతి అనే ఉపదేశాన్ని పౌలు తరువాత ఎదురు చూస్తున్నట్టున్నాడు (4:12, 16 చూడు). ఉదాహరణకు, 29వ వచనంలో సూచింపబడ్డ "ఆత్మ" పరిశుద్ధాత్మయై ఉన్నట్టయితే, అది యూదులకంటె క్రైస్తవులకు ఎక్కువ అర్థ సహితమైయుంటుంది. పైగా, తరువాత రచనలో "నిజమైన సున్నతిని" ఆచరించేవారు క్రైస్తవులని పౌలు సూచించాడు (ఫిలిప్పీయులకు 3:3; కొలొస్సయులకు 2:11 చూడు).[27]

ఆత్మ సంబంధమైన ఇశ్రాయేలును గూర్చి పౌలు మనస్సులో ఉందో లేదో కాని, భౌతికమైన ఇశ్రాయేలుకు నేర్పబడిన పాఠం క్రైస్తవులమైన మనం కూడా నేర్చుకోవాలి: బాహ్యంగా జరిగించే రూపాలు ఎన్నడును చాలినవైయుండవు; హృదయానికి ఏదో ఒకటి సంభవించాలి. ఉదాహరణకు, ఒక వ్యక్తి నీళ్లలో ముంచబడవచ్చు; కాని అతడు "హృదయ పూర్వకంగా" లోబడక ఉన్నట్టయితే (రోమా 6:17, 18; 3, 4 వచనాలు చూడు). జరిగేదంతా అతడు (నీటివలన) తడపబడ్డాడు. ఒక వ్యక్తి – పులియని రొట్టెను తిని ద్రాక్షారసమును త్రాగి – ప్రభురాత్రి భోజనంలో పాలుపొందవచ్చును, గాని – ఆ గురుతుల భావంపై దృష్టిని కేంద్రీకరించనట్టయితే, "శిక్షావిధి కలుగుటకే తిని త్రాగుచున్నాడు" (1 కొరింథీయులకు 11:29; 23–30 వచనాలు చూడు). సంగీత వాయిద్యాలు లేకుండ ఒక వ్యక్తి పాడవచ్చు; కాని "ఆత్మతోను, మనస్సుతోను అతడు పాడలేకయుంటే" (1 కొరింథీయులకు 14:15), అతడు కేవలం శబ్దం చేస్తున్నాడు. ఒక వ్యక్తి అనర్గళంగా మాట్లాడవచ్చు, శ్రద్ధగా పని చేయవచ్చు, త్యాగపూరితంగా యియ్యవచ్చు; కాని తన హృదయంలో ప్రేమ లేకుండ వీటిని జరిగించితే, వాటివలన అతనికి ప్రయోజనముండదు (1 కొరింథీయులకు 13:1–3 చూడు). "నిజమైన క్రైస్తవుడుగా" ఉండడానికి, మనం సరియైన పనులు చేయడం మాత్రమే కాదు, సరియైన విధానంలో మనం వాటిని

చేయవలసియుంటుంది – అంటే, హృదయపూర్వకంగా వాటిని చేయవలసియుంటుంది.

"మాత్రమే కాదు" మరియు "కూడా" అని నేను చెప్పింది గమనించు. దేవుని ఆనందింపజేయడానికి వెలుపల, లోపల కూడ సరిగా ఉండాలి. ఒకడు "వెలుపట" సరిగా ఉన్నా, లేకపోయినా ప్రాముఖ్యం కాదు; "లోపల" మాత్రమే ప్రాముఖ్యమైనట్టు రోమా 2:28, 29 ఉపదేశిస్తున్నట్టు కొందరు తప్పుగా వర్తింపజేస్తారు. ఉదాహరణకు, రోమా 2:28, 29 యొక్క వర్తమానం ప్రాథమికంగా "అక్షరమునకు విరుద్ధంగా ఆత్మ" అని కొందరు నిగ్గదీస్తారు. "ధర్మశాస్త్రము యొక్క అక్షరము" (బైబిలు వాస్తవంగా చెప్పేది) నకు ప్రాముఖ్యం లేదు గాని "ధర్మశాస్త్ర నియమానికి" (సరియైన ఉద్దేశం కలిగి యుండడంలో) సమస్త ప్రాముఖ్యత ఉన్నట్టు వీరు తీర్మానిస్తారు. పాత నిబంధన ఏర్పాటు క్రింద యూదుడు సున్నతి పొందాడా లేదా అనేది "ముఖ్యత్వం కాదని" పౌలు ఉపదేశించాడా? లేదు! యూదుల మగవారు సున్నతిపొందినవారనేది అర్థం చేసికోబడింది. శరీర సంబంధమైన సున్నతి మాత్రమే చాలదని నొక్కి చెప్పడం పౌలు ఉద్దేశమైయుంది. యూదునికి హృదయ సున్నతి కూడా అవసరమైయుంది.

దేవుని సంకల్పంలో బాప్తిస్మం యొక్క స్థానంపైనున్న బైబిలు బోధపై దాడిచేసే అవకాశంగా యితరులు రోమా 2:28, 29ని ఉపయోగించారు. బాప్తిస్మం ఈ లేఖన భాగమందు ప్రస్తావించబడనందున, ఆలాటి వర్తింపు అనుకోకుండనే అనుమానించ బడుతుంది. ఇవ్వబడిన అంశం మీద బైబిలు ఏమి బోధిస్తుందో నీవు కనుగొనాలంటే, ఆ అంశాన్ని ప్రస్తావించే లేఖనముల యొద్దకు వెళ్లు – అంతేగాని ప్రస్తావించబడని లేఖనాల యొద్దకు కాదు. పౌలు బాప్తిస్మం మీద ఏమి బోధించాడో కనుగొనడానికి రోమా 6:3–7 లేదా గలతీయులకు 3:26, 27కు పోవాలి గాని రోమా 2:28, 29కి కాదు. ఏది కాకపోయినా, బాప్తిస్మాన్ని అప్రతిష్ఠపాలు చేయడానికి 28, 29 వచనాలను కొందరు ప్రయాసపడతారు.

ఇంతకు ముందే ప్రస్తావించబడిన "అక్షరమునకు విరుద్ధంగా ఆత్మకు" సంబంధించిన మామూలు వాదనను కొందరు ఉపయోగిస్తారు. బాప్తిస్మమనేది "చట్టము యొక్క అక్షరం" గనుక దాన్ని అంత గొప్పగా పట్టించుకునే అవసరత లేదని వారు నిర్బంధిస్తారు. "వ్యక్తి యొక్క ఆత్మ (హృదయం) సరియైనదైతే," "ఒకడు బాప్తిస్మం పొందాడో లేదో అనేది అంత ప్రాముఖ్యమయ్యింది కాదు" అని వారు తీర్మానించారు. ఈ వివాదంలో ఉన్న సమస్య ఏమంటే, 28, 29 వచనాలలో ఆలాటి తీర్మానం పౌలు మనస్సులో ఉన్నట్టు ఒక చిన్న సూచన (హింట్) కూడ ఏమీ లేదు. రోమా 6ను మనం చదివేటప్పుడు, మానవ విమోచన కొరకైన దేవుని సంకల్పంలో బాప్తిస్మం ప్రాముఖ్యమైన భాగమైయున్నట్టు మనం చూడబోతాం.

సున్నతి బాప్తిస్మం అనేవాటికి సమీకరణ ఏర్పరచ ప్రయత్నంలో, ఎక్కువ ప్రత్యేకమైన వాదాన్ని చేయ యితరులు ప్రయోగిస్తారు. ఆ వాదన యిలా నడుస్తుంది:

- పురుషుడైన యూదుని యూదునిగా చేసేది యూదా కుటుంబంలో జన్మించడం. అతడు యూదుడనడానికి ఎనిమిదవ దినాన సున్నతి

చేయబడడం కేవలం ఒక *గురుతు* (లేక ముద్ర) (రోమా 4:11 చూడు). గనుక, అతడు దేవుని బిడ్డయైయుండడానికి సున్నతితో ఏ సంబంధం లేదు.

- ఆలాగే, "తిరిగి జన్మించడం" (యోహాను 3:3) – "విశ్వాసంవలన మాత్రమే" సాధ్యమౌతుందని వారు అనేది – ఒక వ్యక్తిని దేవుని బిడ్డగా చేస్తుంది. ఒకడు అంతకు ముందే దేవుని బిడ్డయై ఉన్నాడనడానికి బాప్తిస్మం పొందడం కేవలం గురుతు లేక ముద్రయై ఉన్నదని వారంటారు. ("అంతరంగపు శుద్ధీకరణకు బాహ్యమైన గురుతని" బాప్తిస్మాన్ని కొందరు సూచిస్తారు.) అందువలన, ఒకడు దేవుని బిడ్డయైయుండడానికి బాప్తిస్మంతో ఏమి సంబంధం లేదని వారు అంటారు.

ఈ సమీకరణలో చాలా దోషాలున్నాయి, వాటిని విడదీయడానికి ఎక్కడ ఆరంభించాలో తెలిసికొనడం కష్టంగా ఉంది. క్రొత్త జన్మ "విశ్వాసంవలన మాత్రమేయని" బైబిలు బోధించడం లేదు. "నీటి మూలముగాను **ఆత్మ**మూలముగాను జన్మించాలని" ప్రభువైన యేసు చెప్పారు (యోహాను 3:5). సంఘం యొక్క ఆరంభ శతాబ్దాల గుండ వచ్చిన సాధారణమైన అంగీకారం ఏమంటే, యోహాను 3:5లోని "నీరు" బాప్తిస్మపు నీరును సూచిస్తుందనియే. సత్యానికి వారు లోబడినప్పుడు, వారు "మరల జన్మించారని" పేతురు తన పాఠకులకు తెలియజేశాడు (1 పేతురు 1:22, 23). పైగా, రక్షణకు సంబంధించి బాప్తిస్మము "గురుతనో" లేక "ముద్రయనో" బైబిలు ఎక్కడ చెప్పలేదు. కాని, "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడునని" క్రీస్తు అన్నారు (మార్కు 16:16ఎ). "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడును యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి" అని పేతురు తెలిపాడు (అపొస్తలుల కార్యములు 2:38ఎ).

ఏదియెలాగున్నా, బాప్తిస్మమును, సున్నతిని సమీకరణ చేయు ప్రయత్నంపై దృష్టి నిలుపుదాం. బాప్తిస్మానికిని, సున్నతికిని మధ్య సమాంతరాలను లాగే ఏ ప్రయత్నమైనా అసంగతములు (విరుద్ధములయందు) ప్రతిఫలిస్తాయి. యూదులు మాత్రమే సున్నతి చేయబడ్డారు; మనం కేవలం యూదులకు మాత్రమే బాప్తిస్మమియ్యాలా? పురుషులు మాత్రమే సున్నతి చేయబడ్డారు; మనం కేవలం పురుషులకే బాప్తిస్మమియ్యాలా? సాధారణంగా, శిశువులు సున్నతి చేయబడ్డారు; మనం శిశువులకు బాప్తిస్మమియ్యాలా? ("సున్నతి = బాప్తిస్మం" అనే వాదాన్ని ఉపయోగించ ప్రయత్నించువారు, శిశు "బాప్తిస్మాన్ని" సమర్థిస్తారు.)

నాకు తెలిసినంతమట్టుకు, బైబిలులోని ఒక్క లేఖన భాగం మాత్రమే సున్నతిని బాప్తిస్మపు సాదృశ్యంగా ఉపయోగించింది. పౌలు కొలస్సీ సంఘానికి యిలా రాశాడు,

> మీరును, [క్రీస్తు] సున్నతియందు, శరీరేచ్ఛలతో కూడిన స్వభావమును విసర్జించి

> ఆయనయందు చేతులతో చేయబడని సున్నతి పొందితిరి. మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడినవారై ఆయనను మృతులలోనుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి. మరియు అపరాధములవలనను, శరీరమందు సున్నతి పొందక యుండుటవలనను, మీరు మృతులైయుండగా, … మన అపరాధములన్నిటిని క్షమించి, ఆయనతో కూడ మిమ్మును జీవింప చేసెను (కొలొస్సయులకు 2:11-13).

ఈ లేఖన భాగంలో, బాప్తిస్మమును, ఆత్మ సంబంధమైన సున్నతియు సంబంధం కలిగియున్నవి, కాని అవి ఒక్కటే కాదు. బాప్తిస్మం (నీటిలోనికి ముంచడం) మానవ కార్యం, ఆత్మ సంబంధమైన సున్నతి (మన అపరాధములన్నిటిని క్షమించడానికి సంబంధించినది) దైవికమైన కార్యం. ఒకడు బాప్తిస్మం పొందినదానికి *ఫలితంగా* ఆత్మ సంబంధమైన సున్నతి వస్తుంది – అయితే రెండు కార్యములు వ్యత్యాసమైనవి.

మన రక్షణకు బాప్తిస్మము గురుతు అని గాని ముద్రయని గాని ఎన్నడూ సూచింపబడలేదు, కాని అంతరంగమందు నివాసము చేయు ఆత్మ ముద్రయై ఉంది. "ఆయన మనకు ముద్రవేసి, మన హృదయములలో మనకు **ఆత్మ** అను సంచకరువును అనుగ్రహించియున్నాడు" (2 కొరింథీయులకు 1:22). పౌలు ఎఫెసీయులకు యిలా వ్రాశాడు, "మీరును … [క్రీస్తునందు] విశ్వాసముంచి, వాగ్దానము చేయబడిన **ఆత్మ**చేత ముద్రింపబడితిరి. ఈ **ఆత్మ** మన స్వాస్థ్యమునకు సంచకరువుగా ఉన్నాడు" (ఎఫెసీయులకు 1:13, 14). మనం ప్రభువునకు లోబడి బాప్తిస్మం పొందినప్పుడు పరిశుద్ధాత్మ "ముద్రగా" మనకు ప్రసాదింపబడ్డాడు (అపొస్తలుల కార్యములు 2:38; 5:32 చూడు). ఏది ఒక వ్యక్తిని యూదునిగా చేసిందో, ఏది ఒక వ్యక్తిని క్రైస్తవునిగా చేసిందో పరస్పర సంబంధం కలిగించ ప్రయాసపడినట్టయితే, యిలా ఒకటి కన్పించవచ్చు:

- యూదుల కుటుంబములోనికి మగ యూదుని జన్మ అతని యూదునిగా చేసింది. అతడు యూదుడనడానికి సున్నతి గురుతుగా లేక ముద్రగా నిలిచి యుంటుంది.
- క్రొత్త జన్మ (నీటియందు బాప్తిస్మంతో చేర్చి; యోహాను 3:5) ఒకని క్రైస్తవునిగా చేస్తుంది. ఒకడు తిరిగి జన్మించినప్పుడు, తాను క్రైస్తవుడనడానికి ముద్రగా లేక గురుతుగా పరిశుద్ధాత్మ అతనికి యివ్వబడతాడు ( అపొస్తలుల కార్యములు 2:38; రోమా 8:9 చూడు).

సమాంతరం పరిపూర్ణమయ్యింది కాదనుకో. ఈ వాస్తవానికి తోడు, యూదులైన మగవారికి సున్నతి జన్మించిన ఎనిమిదవ దినాన జరిగేది. ఆ వ్యత్యాసం యిక్కడ ఉంది: చట్ట ప్రకారం, భౌతిక జన్మకు ఏడు దినాల తరువాత శరీర సంబంధమైన సున్నతి జరిగేదైయుండగా, నీటి మూలముగాను **ఆత్మ**మూలముగాను మనం జన్మించినప్పుడే దేవుడు మనకు పరిశుద్ధాత్మ అను వరాన్ని ప్రసాదిస్తారు, ఎనిమిది దినాల తరువాత కాదు. ఏది యేమైనప్పటికీ, ఈ రెండు విధానాలకు పోలికలున్నాయి.

లేఖనం ఏమి బోధించడం లేదో చూడడానికి ప్రక్కకు వెళ్లి చాలినంత సమయం

తీసికొన్నాం. అది ఏమి బోధించడం లేదో దాన్ని మరచిపొమ్మని కోరుతున్నాను. ఒక యూదుడు "నిజమైన యూదుడు" కావాలంటే, శరీరమందు సున్నతిపొందినంత మాత్రాన చాలదు; అతడు హృదయమందును సున్నతిపొందినవాడైయుండాలి. అతని హృదయం ప్రభువునందు అతుకబడియుండడం అవసరం; అతడు ఆయనకు బద్ధుడైయుండాలి. ఆలాగే, ఒకడు "నిజమైన క్రైస్తవుడై" ఉండగోరితే, అతడు వెలుపట "సరియైనవాడై" ఉండడం మాత్రమే గాక, అతడు అంతరంగంలో కూడ "సరియైనవాడై" ఉండాలి.

క్రొత్త నిబంధన క్రైస్తవ్యపు పునరుద్ధరణకు నేను కట్టుబడినవాడనైయున్నాను. పునరుద్ధరణలోని ఒక విషయం బాహ్యమైనది: "బైబిలు విషయాలను బైబిలు విధానాల్లో చేయాలి." అదే సమయంలో, బాహ్యమైనదానినే నొక్కి చెప్పుతూ, అంతరంగంలోని దాన్ని అలక్ష్యంచేసే అపాయం ఎప్పుడూ కాచుకొనియున్నట్టు నేనెరుగుదును. మొదటి శతాబ్దపు క్రైస్తవ్యం యొక్క స్వభావానికంటే, దాని పై రూపాన్ని పునరుద్ధరించడం తేలికయే. అందువలన, నేను మరల చెప్పేదేమంటే, "నిజమైన క్రైస్తవులైయుండడానికి," మనం కేవలం వెలుపట రైటైయుండడం మాత్రమే గాక, మనం లోపల కూడా "రైటై" ఉండాలి!

## ముగింపు

తన ఉత్తరంలోని ఈ భాగంలో మొత్తం మీద పౌలు ఉద్దేశమేమైయుందో ఆ దృష్టిని పోగొట్టుకొనకు. పాపం విషయమై యూదులను ఒప్పించడానికి, ఏదో ఒక విధంగా, తాను చెప్పిందంతా లెక్కవేయబడింది – యేసు యొక్క అవసరత వారికున్నట్టు వారిని ఒప్పించడమే. యూదులకు దేవుని నీతి యొక్క అవసరత యూదులకుందని చెప్పడానికి మనకు యింకో పాఠముంది. కొందరు యూదులు రేపే ఆక్షేపణలకు పౌలు జవాబు రోమా 3:1–8లో ఉంది.

ముగింపులో, "నిజమైన యూదుడా దయచేసి లేచి నిలబడతావా?" అనే ప్రశ్నకు మరోసారి తిరిగి వద్దాం. "నిజమైన క్రైస్తవుడా దయచేసి లేచి నిలబడతావా?" అనే దానికి నేను మార్చగోరతాను. నిన్ను ఎరిగిన న్యాయ నిర్ణేతల ఎదుట నీవు కూర్చుండియుంటే – నిన్ను లోపల బయట ఎరిగినవారు ఉంటే – నీకు ఆ ప్రశ్న వేయబడితే, నీవు లేచి నిలుస్తావా? నీవు నిలబడ తెగిస్తావా? నీకు "లోపలి అవసరతగాని" లేక "వెలుపటి అవసరతగాని" ఉంటే, దాని విషయమై నేడే దాన్ని తీర్చుకోమని నేను కోరుతున్నాను! ఆయన రక్తము నీ ప్రతి పాపము కడిగివేయబడునట్లు నీవు క్రీస్తునొద్దకు రమ్ము (గలతీయులకు 3:26, 27; రోమా 6:3–7; కొలొస్సయులకు 1:14; 1 యోహాను 1:7, 9)!

---

సూచనలు

[1]"నిజమైన" అనే పదం AB బ్రాకెట్స్‌లో ఉంది, అది గ్రీకులో లేదని చెప్పడానికి, సూచించడానికి తర్జుమాదారులచే చేర్చబడింది, అది గుప్తమైయున్నట్టు వారు తలంచారు. [2]John Fawcett, "The Precious Book Divine," *Songs of Faith and Praise*, comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard

Publishing Co., 1994). [3]అమెరికాలో, "నీ కాఫీ బల్లపై కేవలం బైబిలును ఉంచుకుంటే" అనే ప్రయోగాన్ని ఉపయోగిస్తాను. [4]The simple verb *temno* is not found in the New Testament; the word is always combined with a preposition. (W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* [Nashville: Thomas Nelson Publishers, 1985], 143.) [5]Vine, 102. [6]Douglas J. Moo, *Romans,* The NIV Application Commentary (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 2000), 97. [7]సున్నతి యూదులకు ప్రాముఖ్యమైనది, ఆది సంఘంలో అది ప్రధాన సమస్యగా రూపొందింది. క్రైస్తవులైన యూదులలో కొందరు అన్యజనులకు సున్నతి చేయించాలని పట్టుపట్టారు (అపొస్తలుల కార్యములు 15:1 చూడు). [8]Quoted in D. Stuart Briscoe, *Mastering the New Testament: Romans,* The Communicator's Commentary Series (Dallas: Word Publishing, 1982), 71. [9]Quoted in John R. W. Stott, *The Message of Romans: God's Good News for the World,* The Bible Speaks Today series (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1994), 92. [10]Quoted in John MacArthur, *Romans 1-8,* The MacArthur New Testament Commentary (Chicago: Moody Press, 1991), 160.

[11]గ్రీకులో యిక్కడ నిర్దిష్టోపపదం లేదు. 25నుండి 29 వచనాలలో "ధర్మశాస్త్రంనకు" ముందు కొన్నిసార్లు ఉపయోగించబడింది, కొన్నిసార్లు ఉపయోగించబడలేదు. మోషే ధర్మశాస్త్రం పౌలు మనస్సులో ఉన్నట్టు సాధారణంగా అంగీకరింపబడింది. [12]Leon Morris, *The Epistle to the Romans* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1988), 140, n. 151. [13]Vine, 340. [14]Morris, 140. [15]Vine, 133. [16]Stott, 93. [17]"భౌతికంగా" అనేదానికి గ్రీకు *ek phuseos* ("స్వభావంవలన"; KJV చూడు). సున్నతిలేని అన్యజనులు తమ "స్వాభావికమైన స్థితిలో" (వారు జన్మించిన శరీర సంబంధమైన స్థితిలో) ఉండిరి. [18]Adapted from Morris, 141. [19]"ధర్మశాస్త్రపు అక్షరము" అనేది ఒకే గ్రీకు పదంనుండి తర్జుమా చేయబడింది (*grammatos*) అంటే "వ్రాయబడినది" అని అర్థం (*The Analytical Greek Lexicon* [London: Samuel Bagster & Sons, 1971], 82). The NIV, RSV, and NKJVల్లో "written code" అని ఉంది. ఈ వచనంలోని సందర్భంలో, వ్రాయబడిన మోషే ధర్మశాస్త్రాన్ని సూచిస్తుంది. [20]J. W. McGarvey and Philip Y. Pendleton, *Thessalonians, Corinthians, Galatians and Romans* (Cincinnati: Standard Publishing, n.d.), 316.

[21]Moses E. Lard, *Commentary on Paul's Letter to Romans* (Lexington, Ky.: N.p., 1875; reprint, Delight, Ark.: Gospel Light Publishing Co., n.d.), 97. [22]ఇక్కడ, "మాంసము" అంటే కేవలం "భౌతికమైన" అని అర్థం. అయితే రోమా పత్రికలో ఈ పదం పలు విధాలుగా వాడబడింది. తరువాత దాన్ని చదువుదాం. [23]రోమా 2:16లో *"krupto"* అనేది "రహస్యములు" అని బహువచన రూపం. [24]*Pneuma* అనే పదానికి పలు రకాలైన అర్థాలున్నాయి. అయితే యిక్కడ ఆ పదానికి "ఆత్మ" అని అర్థం. తరువాత దీన్ని సవిస్తరంగా చర్చించుదాం. [25]రోమా పత్రికలో తరువాత (ప్రత్యేకించి 8వ అధ్యాయంలో) క్రైస్తవుల జీవితాల్లో పరిశుద్ధాత్మ పనిని గూర్చి పౌలు మాట్లాడాడు. అయితే అధ్యాయం 2లో, యూదుల హృదయాల్లో దేవుడు పనిచేయడాన్ని గూర్చి అతడు మాట్లాడుతున్నాడు. [26]Morris, 142. [27]నేడు సంఘము "ఆత్మ సంబంధమైన ఇశ్రాయేలు" అని అనేక లేఖన భాగాలు చూపుతాయి. అరణ్యంలో ఉన్న యూదులను గూర్చి 1 కొరింథీయులకు 10:1లో, అన్యజనులలోనుండి వచ్చిన స్థానిక సంఘానికి పౌలు వ్రాస్తూ, వారిని "మన పితరులని" పిలిచాడు. (నొక్కి చెప్పింది నాది.)